క్లుప్తంగా...

మద్యం ఇప్పించాలని గొడవ

బీరు సీసాతో గొంతులో పొడిచి హత్య


గణేష్ (ఫైల్)

అమీర్‌పేట: మద్యం ఇప్పించాలని పట్టుబడిన రౌడీషీటర్‌ను ఓ వ్యక్తి బీరుసీసా పొడిచి హత్య చేసిన చేసిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాంప్రసాదరావు వివరాల ప్రకారం.. అమీర్‌పేట డివిజన్ బౌద్ధనగర్‌కు చెందిన రౌడీషీటర్ గణేష్ అలియాస్ కన్నీ (43) శుక్రవారం రాత్రి ఎస్‌ఆర్‌నగర్ కమ్యునిటీహాల్ ఎదురుగా ఉన్న న్యూ సోనీ వైన్స్ షాపునకు వెళ్లాడు. పర్మిట్‌రూమ్‌లో సనత్‌నగర్ అశోక్ కాలనీలో ఉంటూ పాస్‌పోర్టు బ్రోకర్‌గా పని చేసే సురేష్ మద్యం తాగుతూ కూర్చున్నాడు. సురేష్ గణేష్‌కు అప్పటికే పరిచయం ఉండటంతో గణేష్ హాఫ్ బాటిల్ ఇప్పించాలని సురేష్‌ను అడగ్గా తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గణేష్ ఆగ్రహంతో సురేష్ ముఖంపై కొట్టాడు. కోపోద్రిక్తుడైన సురేష్ తన చేతిలో బీరు సీసాతో గొంతులో పొడిచాడు. గణేష్ కూడా బీరు సీసాతో ఎదురు దాడి చేయడంతో సురేష్‌తో పాటు అడ్డుకోబోయిన మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గణేష్‌కు తీవ్ర రక్తస్రావం అవుతున్నా సురేష్‌తో గొడవ పడుతూనే ఉన్నాడు. కాసేపటి తర్వాత గణేష కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి గణేష్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఒంటిగంటకు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

చిలకలగూడ : నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, భాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ ఛైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరాదేవి దంపతులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పూజలో బిట్ల రఘునందన్, పాతకోట వేణు,శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం



బౌద్ధనగర్: దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. డివిజన్ పరిధిలోని సంజీవపురం ప్రాంతంలో జరుగుతున్న డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ పనులను శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమెవెంట ఆంజనేయులు, రామేశ్వర్ తదితరులు ఉన్నారు.

కెనడా పార్లమెంట్ సభ్యుడిని కలిసిన జేఎస్‌టీ శాయి

సనత్‌నగర్: కెనడా పార్లమెంట్ సభ్యుడు, ఆ దేశ ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ప్రభుత్వంలో కీలక సభ్యుడు పాల్ చియుంగ్‌ను ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి దంపతులు శనివారం కలిశారు. 60 ఏళ్ల వైవాహిక జీవితాన్ని పూర్తి చేసుకున్న ఆ జంటను పాల్ అభినందించారు. ఈ సందర్భంగా కెనడా పార్లమెంట్ ప్రతినిధిగా గౌరవ ధ్రువీకరణ పత్రాన్ని ఆయన వారికి అందజేశారు. హైదరాబాద్ నగరంలో సీనియర్ సిటిజన్ల అభ్యున్నతి కోసం ఆసరా కమిటీ చేస్తున్న పలు సామాజిక కార్యక్రమాలను పాల్‌కు వివరించారు. భారతీయ సంప్రదాయం ప్రకారం పాల్ చియుంగ్‌ను శాయి శాలువాతో సత్కరించారు.

ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఏఐఎస్‌ఎఫ్ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలని ఓయూ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్, ఏఐఎస్‌ఎఫ్ మాజీ నేత ఉప్పరి ఎల్లేష్ అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవానికి ఆయన హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్య ద్వారానే పేద కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వ నిర్వహణలోనే పేద, మధ్య తరగతి వర్గాలకు ఉచిత విద్య లభిస్తుందని పేర్కొన్నారు. ఓయూలో అన్ని కోర్సులకు భారీగా పెంచిన ఫీజులను తగ్గించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు అధిక శాతం నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిసత్య, బాలరాజు, సాయిభగత్, సలీం, అమర్‌నాథ్, ప్రసాద్, భవాని, శ్రీవాణి, రాధిక, రాధాకృష్ణ, సాయి, వినోద్ పాల్గొన్నారు.

రూ.6 కోట్లతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్

పనులు పరిశీలించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్ల అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. బేగంపేట పాటిగడ్డలో నిర్మితమవుతున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను శనివారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఫంక్షన్ హాల్ పనుల్లో వేగం పెంచి వచ్చేనెల ఒకటో తేదీన ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాటిగడ్డలో అత్యధికంగా పేద ప్రజలు నివసిస్తున్న దృష్ట్యా వారికి మేలు చేయాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ రూ.6 కోట్లతో ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. పేదలు ఏదైనా ఫంక్షన్ చేసుకోవాలంటే రూ. లక్షల్లో అద్దెల రూపంలో చెల్లించాల్సి వస్తుందని వారి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు అతి తక్కువ ధరకు అద్దెకు ఇచ్చేలా మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ తరుణి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ శంకర్, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, ఎలక్ట్రికల్ డీఈ సుధీర్, హార్టి కల్చర్‌ధికారి గణేష్, స్ట్రీట్ లైట్ ఈఈ సంతోష్ పాల్గొన్నారు.

ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలో పర్యటన..

అనంతరం ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలో మంత్రి పర్యటించారు. ఎయిర్‌లైన్స్‌కాలనీలో ఉన్న సమస్యలను తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని పలువురు కోరగా కాలనీ అసోసియేషన్ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీలో ఉన్న పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అలాగే పార్కులో ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు.

ద్విచక్ర వాహనంపై వస్తారు.. ఫోన్లు లాక్కెళ్తారు!

మొబైల్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నలుగురి అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్

రాంగోపాల్‌పేట్: మొబైల్ ఫోన్లను స్నాచింగ్ చేస్తున్న నలుగురు సభ్యుల ఓ ముఠాను మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మహంకాళి ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రవీందర్ ఇన్‌స్పెక్టర్ పరశురాంతో కలిసి వివరాలు వెల్లడించారు. వాయుపురి కాలనీకి చెందిన బరియా రాకేష్ నాగరాజు యాదవ్ అలియాస్ అభిషేక్ (19), అదే ప్రాంతానికి చెందిన గోనె ప్రవీణ్ (21), కాప్రా ఎల్లారెడ్డిగూడకు చెందిన బెల్లంకొండ సాయికృష్ణ (19)తో పాటు ఇదే ప్రాంతంలో ఉండే ఓ 17 ఏళ్ల బాలుడు స్నేహితులు. విలాసాలు, చెడు అలవాట్లకు బానిసైన అవసరాల కోసం మొబైల్ ఫోన్లు తస్కరించి వాటితో జల్సాలు చేయాలని పథకం పన్నారు. ఇలా గతకొన్ని రోజుల నుంచి గోపాలపురం, మహంకాళి, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 2వ తేదీన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీటీవో ప్రాంతంలో ఓ వ్యక్తి సెల్ ఫోన్ లాక్కుని పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీతో పాటు పాత నేరస్తుల డేటా, వాహనాల తనిఖీలను చేస్తూ దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై తిరుగుతుండగా వారిని అరెస్టు చేసి 9 మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనం. రెండు వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఒంటరి వారే టార్గెట్..

బెల్లంకొండ సాయి కృష్ణకు చెందిన డియో వాహనాన్ని నిందితులు స్నాచింగ్‌లకు ఉపయోగిస్తున్నారు. ఈ వాహనానికి నంబర్ ప్లేట్ కూడా లేకుండా అర్ధరాత్రి సమయంలో ముగ్గురు ఒక వాహనంపై వెళ్తూ ఒంటరిగా కనిపించే వ్యక్తులను టార్గెట్ చేసి వారి నుంచి మొబైల్ ఫోన్లు లాక్కుని ఉడాయిస్తారు. ఎప్పుడు వచ్చినా ముగ్గురు వచ్చి తమ పనికానిస్తారు. ఇలాగే మరోమారు మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చి పోలీసులకు పట్టుబడ్డారు.

దొంగకు రిమాండ్

రసూల్‌పురా: తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న దొంగను కార్ఖాన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ సీబీ. రవికుమార్ వివరాల ప్రకారం.. రసూల్‌పురా గన్‌బజార్‌కు చెందిన దుబ్బాక ప్రకాష్ పాత నేరస్తుడు. బేగంపేట, బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో చిల్లర దొంగతనాలు చేసి పలుమార్లు జైలుకెళ్లి వచ్చాడు. కాగా ఈ నెల 9న ఉదయం పదిగంటల సమయంలో డైమాండ్ పాయింట్ కార్తీక్‌ఎన్క్లేవ్‌లో ఓ ఇంటికి తాళం వేసి ఉన్న విషయం గమనించి తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, ఇరవై తులాల వెండి కడియాలను చోరీ చేశాడు. బాధితుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీతో నిందితుడిని గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సికింద్రాబాద్ పాట్ మార్కెట్ వద్ద ప్రకాష్‌ను అరెస్టు రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కరుణాకర్

చిలకలగూడ: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధలను పాటించాలని చిలకలగూడ ట్రాఫిక్ ఎస్ఐ కరుణాకర్ కోరారు. చిలకలగూడ నాగులూరి జీహెచ్‌ఎంసీ పార్కు ప్రాంగణంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కరుణాకర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మైనర్, ర్యాష్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించరాదన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వాహనదారులు తమ ఫోర్ వీలర్స్‌ను పార్కుకు చుట్టూ అక్రమంగా పార్కింగ్ చేయడంతో వాకర్లు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందాయని, అక్రమ పార్కింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. రహదారికి పార్కింగ్ చేసిన వాహనదారులతో మాట్లాడి అక్కడి నుంచి తరలించారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులకు స్థానికులు, వాకర్లు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లపై చెత్త వేస్తే రూ. 1000 జరిమానా


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని బేగంపేట సర్కిల్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఆటోలు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శనివారం ఆయన బేగంపేట బ్రాహ్మణవాడీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రధానంగా బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్-4లో రహదారిపై పెద్ద ఎత్తున చెత్తను వేస్తున్నారన్నారు. చెత్తను సేకరించే ఆటో ఇంటింటికీ వస్తుందని, ప్రతి ఒక్కరూ చెత్తను ఆటోలోనే వేయాలన్నారు. రోడ్లపై చెత్త వేయరాదంటూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ జవాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్క్‌చేసిన యాక్టివా చోరీ

బౌద్ధనగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం (యాక్టివా) చోరీకి గురైన ఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడిక్‌మెట్ లలితానగర్‌కు చెందిన మురళి ఈ నెల 7న రాత్రి సమయంలో ఇంటి ముందు తన హోండా యాక్టివాను పార్క్ చేశాడు. ఉదయం చూడగా కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బోర్డు సీఈఓ బంగ్లాలో గంధపు చెట్టు చోరీ

సనత్‌నగర్: కంటోన్మెంట్ బోర్డు సీఈఓ బంగ్లా ఆవరణలోని గంధపు చెట్టు చోరీకి గురైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కంటోన్మెంట్ బోర్డు సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న మధుకర్ నాయక్ బాలంరాయి సప్పర్‌లైన్‌లోని బంగ్లా నెంబర్ 150/ఏలో ఉంటున్నారు. ఈ నెల 5న గుర్తుతెలియని వ్యక్తి బంగ్లా చుట్టూ ఉన్న కంచెను కత్తిరించి లోపలికి చొరబడి అక్కడ ఉన్న ఓ గంధపు చెట్టును నరికి తీసుకెళ్లారు. బోర్డు ఇన్‌ఛార్జి హార్టికల్చర్ మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దొంగిలించిన గంధపు చెట్టు విలువ లక్షల్లోనే ఉంటుందని భావిస్తున్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి


కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న క్రైస్తవులు

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్ ఆమ్‌శ్రీ ప్లాజాలోని గ్లోబల్ పీస్ ప్రేయర్ ఆధ్వర్యంలో శనివారం మణిపూర్ మృతులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మణిపూర్‌లో త్వరలోనే ప్రశాంత వాతావరణం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు దైవజనులు గిరీష్ బాబు ప్రత్యేక బోధనలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సాల్మాన్ రాజు, మహస్తందర్, ఆర్వీ మహేందర్‌కుమార్, నరేందర్, సీఎస్ఎస్ నాయకులు పవీ యోహాన్ తదితరులు మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని అందువల్లే మణిపూర్‌లో ఇలాంటి ఆకృత్యాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రపంచం మొత్తం మణిపూర్‌లో జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ పీస్ ప్రేయర్ పాస్టర్ డాక్టర్ రెవరెండ్ ప్రభు హాజరయ్యారు.

రాష్ట్ర విపణిలోకి దవాసాజ్ సరికొత్త ఉత్పత్తులు


ఉత్పత్తుల ఆవిష్కరణలో రోహిత్‌గుప్తా

సనత్‌నగర్: ప్రముఖ హెర్బల్ ప్రొడక్ట్ సంస్థ దవాసాజ్-120 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒకేసారి 43 ప్రీమియం స్పెషలైజ్డ్ బ్యూటీ కేర్ ఉత్పత్తులను రాష్ట్ర విపణిలోకి విడుదల చేసి రికార్డు సృష్టించింది. బేగంపేటలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్‌గుప్తా హాజరై ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్టమర్ల అవసరాలు, అభిరుచులను దృష్టిలో ఉంచుకొని ఆయా ఉత్పత్తులను ప్రారంభించడం జరిగిందన్నారు. దేశమంతటా తమ ఉత్పత్తులు అందుబాటులో ఉండడంతో పాటు అనేక దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. ప్రధానంగా కాలుష్య కారకాల నుంచి వినియోగదారులను ఏవిధంగా కాపాడాలనే అంశంపై దృష్టి సారించి తమ ఉత్పత్తులను తయారుచేయడం జరుగుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వన్ వ్యవస్థాపకుడు, సీఈఓ హేరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


నిరోష

లాలాపేట: ఓ యువతి అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తార్నాక గోఖుల్‌నగర్ నివాసి నిరోష (22) ఈ నెల 11న పని కోసం వెళ్లిన ఆమె ఎంతకీ ఇంటికి రాలేదు. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి యాదగిరి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి


అలరించిన విద్యార్థినుల డ్యాన్స్

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రముఖులు సూచించారు. రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజ్‌లో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో రిటైర్డ్ లెఫ్టినెంట్ (ఎయిర్‌ఫోర్స్) చత్రపాల్ సింగ్, ప్రముఖ సినీ కొరియో గ్రాఫర్ నిక్సన్, ప్రిన్సిపాల్ జ్ఞానారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్, టీవీలు తదితర వినోద కార్యక్రమాలతో తక్కువ సమయం కేటాయించి చదువుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కీలకమైన ఈ దశలో ఎలాంటి లోతైన, భావోద్వేగంతో కూడుకున్న బంధాలను ఏర్పచుకోవద్దని, బాలబాలికలు అందరూ స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని సూచించారు. క్రీడలతో పాటు తమలోని ప్రతిభను దాచుకోకుండా దాన్ని వెలికి తీసే యత్నాలు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్యాన్సులతో అలరించారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపులో విఫలం'


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోనూ డబుల్ బెడ్రూమ్ ఇవ్వడంలో స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీని విస్మరించారని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆరోపించారు. ఇళ్ల కేటాయింపులో విఫలమయ్యారంటూ ఆరోపిస్తూ శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కట్టించిన కొన్ని ఇళ్లు కూడా లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయన్నారు. వారాసీగూడ నుంచి సీతాఫల్‌మండి మీదుగా చిలకలగూడ వరకు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో ర్యాలీ నిర్వహిస్తూ ఇందిరాపార్కుకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, కన్నాభిరామ్, అంబాల రాజేశ్వర్‌రావు, మేకల కీర్తి, ముఠా గణేశ్, దత్తు, లావణ్య, లక్ష్మి, భాగ్యమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.


ధర్నాకు వెళ్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్ నుంచి..

బౌద్ధనగర్: అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నాకు శనివారం బౌద్ధనగర్ నుంచి మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులకు డబుల్ బెడ్రూమ్‌లు వెంటనే కేటాయించాలని, నూతనంగా దరఖాస్తు చేసుకున్న వారిని కూడా పరిశీలించి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రవిప్రసాద్ గౌడ్, నేతి సత్యనారాయణ, సుధాకర్, చైతన్య, సంపత్, ఓములు, నాగేశ్వరరావు, వెంకటేష్, అమరావతి, బైరి సరేస్, శ్యామ్ ముదిరాజ్, రాంబాబు ధర్నాకు వెళ్లారు.

'రాష్ట్రంలో ప్రజా కంటక పాలన'


బోయిగూడలో పాదయాత్ర చేస్తున్న రవీందర్ గౌడ్

బన్సీలాల్‌పేట్: తెలంగాణలో ప్రజా కంటక పాలన సాగుతుందని రానున్న కాలంలో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్ గౌడ్ ఆరోపించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో శనివారం పార్టీశ్రేణులతో కలిసి పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ హామీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాయమాటలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు రూ. 4 వేల భృతి, భూమి లేని నిరుపేదలకు ప్రతి ఏడాది రూ. 12వేల ఆర్థిక సాయం చేస్తోందన్నారు. రానున్న కాలంలో సనత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

స్వదేశంలోనే సేవలందించాలి



బన్సీలాల్‌పేట్: నర్సింగ్ విద్యార్థులు కోర్సు అనంతరం విదేశాలకు వెళ్లకుండా దేశంలోని వైద్య సేవలను అందించాలని పలువురు వక్తలు సూచించారు. సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్‌లో శనివారం ట్రైన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. విద్యార్థుల సాధికారత, అవకాశాలు మరియు సవాళ్లు అనే అంశంపై జరిగిన సదస్సులో అసోసియేషన్ సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జెనీకంప్, టీఎస్ఎన్ఎంసీ రిజిస్ట్రార్ విద్యావతి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి ఈ వృత్తిలో రాణించాలని చిత్తశుద్ధితో సేవలు నిర్వర్తించడం ద్వారా నర్సింగ్ వృత్తి పేరు ప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలని కోరారు. హైదరాబాద్ హెల్త్ హబ్‌గా విరాజిల్లుతున్నదని ఇక్కడే ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. నర్సింగ్ వృత్తిలో ఉంటూ కూడా ఐఎఎస్, ఐపీఎస్‌గా ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఎంతో మంది ఈ వృత్తిని పూర్తి చేసి దేశ, విదేశాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, సైంటిఫిక్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కొరియోగ్రాఫర్ నిక్సన్ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ ఈ కార్యక్రమంలో నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ విద్యుల్లత, టీఎస్ఏఐ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరి, స్వరాజ్యవాణి, బాంధవి, ఇవ్వాంజిథియాస్, వెంకటరమణ, ప్రసన్నకుమారి, సునీల పాల్గొన్నారు.

కస్తూర్బా హైస్కూల్‌లో ఇన్వెస్టిచర్ ప్రోగ్రాం

రసూల్‌పురా: రసూల్‌పురా కస్తూర్బా హైస్కూల్‌లో శనివారం ఇన్వెస్టిచర్ వేడుక ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు బి.ప్రేమ్ హెడ్‌బాయ్, మిస్బా ఫాతిమా హెడ్‌గర్ల్, డిప్యూటీ హెడ్‌బాయ్‌గా 9వ తరగతి విద్యార్థి కార్తీక్‌షా, డిప్యూటీ హెడ్‌గర్ల్‌గా కౌసర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఓమేశ్వరి, కరస్పాండెంట్ ఓంకార్ వీరికి పరిపాలన బాధ్యతలను అప్పగించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సదా కేశవ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ టిఎస్. శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కెప్టెన్, వైస్ కెప్టెన్‌గా నియమితులైన విద్యార్థులు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ టెంపుల్ కమిటీ సభ్యుడు నరేష్, నాసర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల గొప్పలు సిగ్గుచేటు : జేఎమ్మార్


మాట్లాడుతున్న బోర్డు మాజీ సభ్యులు

కంటోన్మెంట్: స్కైవేలకు భూములు కేటాయించడాన్ని బీజేపీ నేతలు తమ గొప్పతనంగా చెప్పుకోవడం సిగ్గుచేటని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) అన్నారు. మాజీ బోర్డు సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, నళిని, అనిత ప్రభాకర్‌తో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర ఉత్తర భాగంలో అభివృద్ధికి ఆర్మీ స్థలాలు అడ్డంకిగా మారాయన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని రెండు ప్రధాన రహదారుల విస్తరణకు తాము ఎనిమిదేళ్లుగా ప్రయత్నాలు చేయగా, ఎట్టకేలకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. ఇదంతా తెలిసి కూడా స్థానిక బీజేపీ నేతలు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం దారుణమన్నారు. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనం విషయంలోనూ బీజేపీ అధిష్ఠానం వైఖరికి భిన్నంగా బోర్డు నామినేటెడ్ సభ్యుడు వ్యవహరిస్తున్నాడని దుయ్యబట్టారు. తీరా విలీనం పూర్తయ్యాక మళ్లీ తన ఘనతే అని చెప్పుకుంటాడని విమర్శించారు. కంటోన్మెంట్‌కు రూ.700 కోట్ల సర్వీసు చార్జీలు ఇప్పిస్తానని చెప్పిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవే ఊడిపోయిందన్నారు. ప్యారడైజ్-సుచిత్ర, ప్యాట్నీ- హకీంపేట రోడ్ల విస్తరణకు అవసరమైన భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు చెల్లిస్తోందన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


నూతన కమిటీ ఎన్నిక

చిలకలగూడ: ఆటో డ్రైవర్ల యూనియన్ సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమురెల్లి బాబు డిమాండ్ చేశారు. మెట్టుగూడ డివిజన్ మైలార్‌గడ్డ స్టాండ్‌లో శనివారం జరిగిన ఆటో యూనియన్ డ్రైవర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రయాణికుల రవాణా రంగంలోకి ఓలా, ఉబర్ వంటి సంస్థల రావడంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారని, హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ పరిధిలో సదరు సంస్థలను నిషేధించాలని కోరారు. గత తొమ్మిదేళ్లుగా ఆటో యూనియన్ డ్రైవర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. మైలార్‌గడ్డ ఆటోస్టాండ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాములు, కార్యదర్శి భిక్షపతి, ఉపాధ్యక్షులు యాకయ్య, సిల్వర్‌శివ, ఆర్గనైజర్ కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో షేక్ లతీఫ్, కుమార్, వంశీ, శ్రీను, రవి, భాస్కర్, గోపాల్, యాదగిరి, ప్రవీణ్, సత్తయ్య, మల్లేష్, మహేష్, నాగేశ్ పాల్గొన్నారు.

చెన్నై షాపింగ్ మాల్‌లో చోరీ సిబ్బంది పనేనా?

రూ.5 లక్షల చీరల దొంగతనం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని చెన్నై షాపింగ్ మాల్‌లో ఇంటి దొంగలు చేతివాటం ప్రదర్శించి రూ.5 లక్షల విలువ చేసే చీరలను దొంగిలించారు. పోలీసుల కథనం మేరకు చెన్నై షాపింగ్ మాల్‌లో ప్రతి నాలుగు నెలలకు జరిగే ఆడిట్‌లో భాగంగా 10 రోజుల క్రితం ఆడిట్ నిర్వహించగా రూ.5 లక్షల విలువ చేసే వస్తువుల్లో తేడా వచ్చింది. స్టోర్ మేనేజర్ శ్రీధర్ ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలు పరిశీలన, కిందిస్థాయి సిబ్బందిని విచారణ చేయగా కొంత మంది స్వీపర్స్ పాత్ర ఉన్నట్లు గుర్తించారు. షాపింగ్ మాల్‌లో కొట్టేసిన చీరల్లో అత్యంత విలువైనవి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. స్వీపర్లు చెత్తను బయటకు తీసుకుని వెళ్లే క్రమంలోనే అందులోనే చీరలు తస్కరిస్తున్నట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు.